సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను మా ప్రతినిధి ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
91829 05602
నంబర్‌లో సంప్రదించండి

ప్రతి ఇంటా సంక్షేమం

- అదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ లక్ష్యం
- జగనన్న సురక్ష క్యాంప్‌లో కె.కె.రాజు
- 48వ వార్డులో లబ్ధిదారులకు 1,026 ధ్రువపత్రాల అందజేత


లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు

కంచరపాలెం: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సేవలు, సంక్షేమ ఫలాలు అందించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. జీవీఎంసీ 48వ వార్డు ఊర్వశి జంక్షన్ జాతీయ రహదారిలోని స్టీల్‌సిటీ పబ్లిక్ స్కూల్ ఆవరణలో వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి నీలి రవి ఆధ్వర్యంలో సోమవారం జగనన్న సురక్ష క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులందరూ ప్రభుత్వ పథకాలు పొందేందుకు అవసరమైన ధ్రువపత్రాలు అందించేందుకే సీఎం వైఎస్ జగన్ ఈ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారన్నారు. జగనన్న సురక్ష ద్వారా సులువుగా అనేక రకాల సర్టిఫికెట్లను లబ్ధిదారులు పొందుతున్నారని చెప్పారు. 48వ వార్డులోని 21086271, 272, 273, 274, 276, 277 సచివాలయాల పరిధిలో 1,123 దరఖాస్తులు రాగా.. లబ్ధిదారులకు 1,026 ధ్రువపత్రాలు అందజేసినట్లు తెలిపారు. ప్రజల ఇంటి వద్దకే వలంటీర్లు వెళ్లి వారికి ఏం కావాలో తెలుసుకొని దరఖాస్తులు చేయించి సేవలందిస్తున్నారన్నారు. నెల రోజుల పాటు జగనన్న సురక్ష శిబిరాలు జరుగుతాయని, అర్హులంతా సద్వినియోగం చేసుకోవాలని కె.కె.రాజు కోరారు. విద్య, వైద్య రంగాలకు ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యాన్ని వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కర్రి రామారెడ్డి, ఏఈ అర్చన, ఏపీడీ పద్మావతి, జేసీఎస్ మండల కన్వీనర్ అమర్‌రెడ్డి, వసంతల అప్పారావు, కె.సత్యనారాయణరెడ్డి, గురువాజీ, రాంబాబు, జాన్సన్, జాగరపు అప్పారావు, నరేష్, డి.శ్రీను, పి.పద్మా, పార్వతి, గోపి, భరత్, సచివాలయ సిబ్బంది, కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

సచివాలయాల పరిధిలో లబ్ధిదారులు పొందిన సర్టిఫికెట్ల వివరాలు

సచివాలయం	ఏరియా	సర్టిఫికెట్లు
21086271	రాంజీ ఎస్టేట్-2	303
21086272	బాపూజీనగర్	84
21086273	ఏఎస్సార్ నగర్	223
21086276	జైభారత్‌నగర్	116
21086277	మురళీనగర్-1	300

క్యాస్ట్ సర్టిఫికెట్ అందుకున్నా..



కుల ధ్రువపత్రం కోసం వలంటీర్ ద్వారా దరఖాస్తు చేసుకున్నాను. అది లేకపోవడంతో నా పిల్లల చదువుకు ఇబ్బంది కలిగేది. ఇప్పుడు జగనన్న సురక్ష క్యాంప్‌లో క్యాస్ట్ సర్టిఫికెట్ పొందాను. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హత సాధించాను. నా పిల్లలకు కూడా దరఖాస్తు చేసుకుంటాను. చాలా ఆనందంగా ఉంది.
– ఎస్.కె.సపూర, బర్మాక్యాంప్

వలంటీర్ల సేవలు బాగున్నాయి



సీఎం వైఎస్ జగన్ ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా నాకు, నా పిల్లలకు రెండు రోజుల్లోనే ఆదాయ, కుల ధ్రువపత్రాలు అందజేశారు. పిల్లల చదువుకు ఈ రెండు సర్టిఫికెట్లు ఎంతో అవసరం. ఇప్పుడు వాటిని పొందాను. ఎంతో సంతోషంగా ఉంది. వలంటీర్ల సేవలు చాలా బాగున్నాయి.
– బి.లీలారాణి, జైభారత్‌నగర్

బాక్సింగ్‌లో విద్యార్థికి బ్రాంజ్ మెడల్


బ్రాంజ్ మెడల్ సాధించిన సుబ్రహ్మణ్యాన్ని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

సీతంపేట: అరుణాచల్ ప్రదేశ్ ఇటానగర్‌లో ఈ నెల 9 నుంచి 14 వరకు జరిగిన 5వ జూనియర్ బాయ్స్ నేషనల్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్ విద్యార్థి పుక్కళ్ల సుబ్రహ్మణ్యం అద్భుత ప్రతిభ చూపాడు. 46–48 కిలోల విభాగంలో బ్రాంజ్ మెడల్ సాధించారు. ఈ సందర్భంగా సోమవారం సుబ్రహ్మణ్యాన్ని హైస్కూల్ హెచ్ఎం లక్ష్మీ నరస, సీనియర్ ఉపాధ్యాయులు ఆర్.శ్రీనివాసరావు, పీడీ సునంద్, సహచర విద్యార్థులు అభినందించారు.

విద్యార్థిని మృతదేహానికి పోస్టుమార్టం పూర్తి

సీతమ్మధార: హాస్టల్ మేడపై నుంచి కింద పడి చికిత్స పొందుతూ మరణించిన ఇంటర్మీడియట్ విద్యార్థిని మృతదేహానికి పోస్టుమార్టం పూర్తి చేశారు. అక్కయ్యపాలెంలోని ఓ కళాశాలలో ఇంటర్ సెకండియర్ చదువుతున్న విద్యార్థిని(17) దొండపర్తి నెహ్రూ బజార్ సమీపంలోని ఒక ఒక ప్రైవేట్ హాస్టల్లో ఉంటోంది. శుక్రవారం రాత్రి హాస్టల్ మూడో అంతస్తు పైనుంచి కింద పడటంతో తీవ్రంగా గాయపడింది. ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందిన విషయం తెలిసిందే. ఫోర్త్ టౌన్ పోలీసులు కోల్‌కతాలోని విద్యార్థిని తల్లిదండ్రులకు సమాచారం అందించడంతో ఆదివారం ఉదయం వారు విశాఖ చేరుకున్నారు. ఈ సంఘటనపై రంగంలోకి దిగిన సీఐ శ్రీనివాసరావు హాస్టల్ రూంలో ఉన్న విద్యార్థిని స్నేహితులను ప్రశ్నిస్తున్నారు. కొద్ది రోజులుగా విద్యార్థిని ప్రవర్తనపై తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చినట్లు హాస్టల్ నిర్వాహకులు పోలీసులకు చెప్పినట్లు తెలిసింది. శుక్రవారం మేడపై దుస్తులు తీసుకోవడానికి వెళ్లి అక్కడి నుంచి దూకినట్లు సమాచారం. దీనిపై ఫోర్త్ టౌన్ పోలీసులు ఆరా తీస్తున్నారు. పలు కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

రహదారి ఆక్రమణల తొలగింపు


నార్త్ ఎక్స్‌టెన్షన్‌లో బడ్డీకొట్లు తొలగిస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు

సీతమ్మధార: జోన్-3 పరిధి 14వ వార్డు సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని రోడ్డుపై అనధికారంగా ఏర్పాటు చేసిన బడ్డీకొట్లను సోమవారం జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు తొలగించారు. జీవీఎంసీ కమిషనర్, సీసీపీ, డీసీపీల ఆదేశాల మేరకు టీపీవో తేజ పర్యవేక్షణలో ఈ చర్యలు చేపట్టారు. నార్త్ ఎక్స్‌టెన్షన్ షిర్డీసాయిబాబా దేవాలయ పరిసర ప్రాంతాల్లో రోడ్లను ఆక్రమించిన బడ్డీలను తీసివేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఎటువంటి ఆక్రమణలు చేపట్టినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జోన్-3 పరిధిలో ఎక్కడైనా వాల్‌పోస్టర్లు అతికిస్తే జరిమానాలు విధిస్తామన్నారు. సెక్రటరీలు, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

లలితా పీఠంలో ప్రత్యంగిరా హోమం


హోమం నిర్వహిస్తున్న వేద పండితులు

సీతంపేట: లలితానగర్ లలితా పీఠంలో అమావాస్య సందర్భంగా సోమవారం శ్రీ ప్రత్యంగిరా భద్రకాళి హోమం నిర్వహించారు. కుర్తాళం పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ స్వామి అనుగ్రహంతో పండితుల వేద మంత్రాల నడుమ శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులు పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. పీఠం విస్తరణాధికారి మన్నవ కృష్ణసేన్ మాట్లాడుతూ భక్తుల కోరిక మేరకు లలితా పీఠంలో ప్రతి అమావాస్య రోజూ ప్రత్యంగిరా భద్రకాళి హోమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. శత్రు నాశనం, ఆర్థిక ఇబ్బందులు తొలగేందుకు, కోర్టు కేసుల్లో విజయం, ఉద్యోగ అభివృద్ధి విషయంలో శుభ ఫలితాల కోసం ఆదిపరాశక్తి ప్రత్యంగిరాదేవి అనుగ్రహం పొందేందుకు ఈ హోమం చేసినట్టు చెప్పారు.

'స్పందన'కు 10 అర్జీలు

సీతమ్మధార: సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 10 వినతులు అందాయి. అర్జీదారుల వద్ద నుంచి వాటిని తహసీల్దార్, మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ఆనంద్‌కుమార్ స్వీకరించి పరిశీలించారు. కుల, ఆదాయ, నివాస, కుటుంబ సభ్యత్వం తదితర ధ్రువీకరణ పత్రాల కోసం పలువురు దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో డీటీ, ఆర్ఐ, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

26వ వార్డులో మెగా ఫాగింగ్


లలితానగర్‌లో ఫాగింగ్ చేస్తున్న జీవీఎంసీ సిబ్బంది

సీతంపేట: సీజనల్ వ్యాధులను వ్యాప్తి చేసే దోమల నిర్మూలనకు జీవీఎంసీ మలేరియా విభాగం సోమవారం సాయంత్రం 26వ వార్డులోని పలు ప్రాంతాల్లో మెగా ఫాగింగ్ చేపట్టింది. లలితా నగర్, బోరావారి వీధి, చాకలిపేట, రామకృష్ణానగర్, సాక్షి లైన్, శంకువానిపాలెం, శంకమఠం రోడ్, అక్కయ్యపాలెం మెయిన్ రోడ్, శివాలయం వీధి, చిన్నూరు, వార్డు ఆఫీస్, జగ్గారావు బ్రిడ్జి ప్రాంతాల్లో సిబ్బంది చేసిన ఫాగింగ్‌ను మలేరియా ఇన్‌స్పెక్టర్ బి.శ్రీనివాసరావు, సూపర్‌వైజర్ కె.ఎస్.ఎస్.నారాయణ, శివ పర్యవేక్షించారు.

30న సంగీత కళాకారుల సంఘ ఎన్నికలు

మద్దిలపాలెం: విశాఖ సంగీత కళాకారుల సంఘం ఎన్నికలు ఈ నెల 30న నిర్వహించనున్నామని సంఘం కన్వీనర్ చెన్నా తిరుమలరావు తెలిపారు. దరఖాస్తులను ఈ నెల 25వ తేదీ వరకు స్వీకరించనున్నామన్నారు. ఎన్నికల్లో అన్ని అంశాలలో సేవలందిస్తున్న కళాకారులకు ప్రాధాన్యత ఇవ్వనున్నామన్నారు. సంఘంలో సభ్యత్వ నమోదు ప్రక్రియను ఈ నెల 23వ తేదీ వరకు నిర్వహించనున్నామని ఆయన పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 81796 05267 నంబర్‌కు ఫోన్ చేసి సంప్రదించాలని కోరారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన నేడు

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరిగే ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబర్ 060810011006681 టౌన్ కొత్తరోడ్డు బ్రాంచ్, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ చేస్తారు. వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చు.

'నవరత్నాలు'తో అందరికీ మేలు


సంక్షేమ పథకాల బ్రోచర్ అందిస్తున్న సమన్వయకర్త కె.కె.రాజు, కార్పొరేటర్ ఉషశ్రీ

సీతంపేట: బడికి వెళ్లే పిల్లల నుంచి 60 ఏళ్ల వృద్ధుల వరకు అందరికీ మేలు జరిగేలా నవరత్నాలు పేరిట సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. జీవీఎంసీ 43వ వార్డు అక్కయ్యపాలెం, యలమంచిలి వారి వీధి ప్రాంతాల్లో సోమవారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీతో కలిసి ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. నివాసుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ ప్రజలకు సేవ చేయాలన్న నిబద్ధత, పట్టుదల, కష్టపడి పనిచేసే తత్వాన్ని మనందరం ఆదర్శంగా తీసుకుని సీఎం వైఎస్ జగన్‌కు అండగా నిలవాలని కోరారు.

కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోందన్నారు. ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలను అందజేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, 42వ వార్డు కార్పొరేటర్ ఆళ్ల లీలావతి శ్రీనివాస్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కిరణ్‌రాజు, మాజీ కార్పొరేటర్ బులుసు జగదీష్, 43వ వార్డు నాయకులు జక్కంపూడి సత్యనారాయణ, ఎస్.తిరుపతి, బైర వెంకట్, పారుపల్లి రవి, వీరబాబు, రాణి, ఎన్.కుమార్, సింహాచలం, ప్రశాంత్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

నెడ్‌క్యాప్ చైర్మన్‌గా రెండేళ్లు పూర్తి


కేక్ కట్‌చేస్తున్న నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు

సీతంపేట: వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు నెడ్‌క్యాప్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించి రెండేళ్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా సోమవారం 43వ వార్డు కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ ఆధ్వర్యంలో నందగిరినగర్‌లోని పార్టీ వార్డు కార్యాలయంలో కె.కె.రాజు కేక్ కట్‌చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కిరణ్‌రాజు, పార్టీ నాయకులు షేక్ బాబ్జి, జక్కంపూడి సత్యనారాయణ, బైర వెంకట్ పాల్గొన్నారు.

పాఠ్య పుస్తకాల సరఫరా పరిశీలన


ఎండీయూ వాహనం ద్వారా సరఫరా అవుతున్న పాఠ్య పుస్తకాల వివరాలు తెలుసుకుంటున్న డీఎస్‌వో సూర్యప్రకాశరావు

మహారాణిపేట: సివిల్ సప్లయిస్‌కు చెందిన మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్(ఎండీయూ) వాహనం ద్వారా పాఠ్య పుస్తకాలు స్కూళ్లకు సరఫరా అవుతున్న తీరును సోమవారం డీఎస్‌వో సూర్యప్రకాశరావు పరిశీలించారు. పాత పోస్టాఫీసు వద్ద ఉన్న క్వీన్‌మేరీ హైస్కూల్‌లో పాఠ్య పుస్తకాల స్టాక్ పాయింట్‌ను ఏర్పాటు చేశారు. ఇక్కడ నుంచి మహారాణిపేట, సీతమ్మధార, గాజువాక, ములగాడ మండలాలకు పాత పుస్తకాలను సరఫరా చేసే బాధ్యతను ఎండీయూ వాహనాలకు అప్పగించారు. ఈ నాలుగు మండలాల్లోని పాఠశాలలకు ఇక్కడ నుంచి పాఠ్య పుస్తకాలు రవాణా చేస్తున్నారు. ఈ స్టాక్ పాయింట్‌ను డీఎస్‌వో సందర్శించి పుస్తకాల రవాణా, స్కూళ్లకు సరఫరా, ఇతర వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

ప్రజలకు ఆహ్లాదకర వాతావరణమే లక్ష్యం


చిన్నారుల క్రీడా ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న మేయర్ హరివెంకటకుమారి, విజయనిర్మల

ఎంవీపీ కాలనీ: జీవీఎంసీ 19వ వార్డులో తీరాన్ని ఆనుకుని ఉన్న లాసన్స్‌బే కాలనీ పార్కును ఆహ్లాదకరంగా తీర్చిదిద్దారు. వేస్టు టు వండర్స్ పేరిట పార్కులో ఆధునికీకరించిన పలు క్రీడా ప్రాంగణాలను మేయర్ గొలగాని హరివెంకటకుమారి, వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల సోమవారం సాయంత్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగర ప్రజలకు ఆహ్లాదాన్ని అందించే క్రమంలో పార్కులను ఉన్నతంగా తీర్చిదిద్దుతున్నట్టు తెలిపారు. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ఆలోచనల్లో భాగంగా వేస్ట్ టు వండర్స్ కాన్సెప్ట్‌తో ఈ పార్కులో క్రీడా ప్రాంగణాలను అభివృద్ధి చేశామన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్ ద్వారా సేకరించిన వ్యర్థాలను, టైర్లను వినియోగించి అన్ని వయసుల వారికి ఆహ్లాదం పంచే విధంగా పార్కును తీర్చిదిద్దామన్నారు. ప్రారంభం అనంతరం ఆయా క్రీడా, ఆహ్లాదకరమైన సముదాయాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ అదనపు కమిషనర్ సన్యాసిరావు, ప్రధాన వైద్యాధికారి నరేష్‌కుమార్, కార్పొరేటర్ నూకరత్నం, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జ్ సూరాడ వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ భూతంపై వీధి నాటిక


వీధి నాటిక ప్రదర్శిస్తున్న కళాకారులు

మద్దిలపాలెం: పర్యావరణానికి హానికరంగా మారిన ప్లాస్టిక్‌ను నిషేధించాలని, స్వచ్ఛ సర్వేక్షణ్‌లో విశాఖను ప్రథమ స్థానంలో నిలపాలని కోరుతూ సోమవారం పిఠాపురం కాలనీలోని వారపు సంత, మద్దిలపాలెంలో బస్టాండ్‌లో వీధి నాటికను ప్రదర్శించారు. జీవీఎంసీ సౌజన్యంతో రసజ్ఞ సాంస్కృతిక సేవా సంఘం సభ్యులు నాటిక ప్రదర్శనలు ఇస్తున్నారు. పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యానికి మేలు అంటూ కథాంశంగా ప్రదర్శిస్తూ అందరినీ ఆకట్టుకున్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్–2023లో విశాఖ నగరం ప్రథమ స్థానం సాధించడానికి ప్రతి ఒక్కరూ ఓటింగ్‌లో పాల్గొనాలని పిలుపు నిచ్చారు. దండు నాగేశ్వరరావు రచించిన ఈ నాటికకు రసజ్ఞ త్రినాథరావు దర్శకత్వం వహించారు.

పాపాహోమ్‌కు బాలుడి అప్పగింత


తేజకిరణ్ నుంచి వివరాలు తెలుసుకుంటున్న ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి, సీఐ సాయి

మర్రిపాలెం: పాపా హోమ్ నుంచి తప్పించుకున్న ఓ బాలుడిని కంచరపాలెం పోలీస్‌లు తిరిగి అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... అనకాపల్లి జిల్లా తోటకూర గ్రామానికి చెందిన చీపురుపల్లి తేజకిరణ్(9)ను తండ్రి ఈశ్వరరావు మూడు నెలల కిందట నగరంలోని పోలీస్ బ్యారెక్స్ వద్ద గల పాపా హోమ్‌లో చేర్పించారు. అయితే హోమ్ నుంచి తప్పించుకున్న ఆ బాలుడు కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్లపై ఆదివారం సంచరించడాన్ని పోలీసులు గమనించారు. వెస్ట్ సబ్ డివిజన్ ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి, సీఐ ఎస్.సాయి, ఏఎస్ఐ సతీష్ ఆ బాలుడి వివరాలు తెలుసుకుని మళ్లీ పాపా హోమ్‌కు అప్పగించారు.

సిబ్బంది అంకితభావంతో పనిచేయాలి


మాట్లాడుతున్న ఏఈఎంఎస్ ఆపరేషన్ హెడ్ డాక్టర్ సునీల్

మహారాణిపేట: సిబ్బంది అంకిత భావంతో పనిచేయాలని అరబిందో ఎమర్జెన్సీ మెడికల్ సర్వీస్(ఏఈఎంఎస్) ఆపరేషన్ హెడ్ డాక్టర్ సునీల్ కోరారు. సోమవారం రేసపువానిపాలెంలో ఉన్న డీఎంహెచ్‌వో కార్యాలయ ఆవరణలో జరిగిన 108 అధికారుల జోనల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. సంస్థను మరింత అభివృద్ధి పథంలో నడిపించడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. అంబులెన్స్ నిర్వహణలో పలు మెళకువలు నేర్పారు. జోనల్ మేనేజర్ గణేష్, జోనల్ ఫ్లీట్ మేనేజర్ రవికిరణ్, జిల్లా మేనేజర్ త్రినాథ్, డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ సురేష్ పాల్గొన్నారు.

వీధి కుక్కల బెడదపై ప్రత్యేక దృష్టి

డాబాగార్డెన్స్: జీవీఎంసీ పరిధిలో వీధి కుక్కల బెడదపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. జీవీఎంసీ అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్ ఆదేశాల మేరకు వెటర్నరీ విభాగపు అధికారి డాక్టర్ కిషోర్ నేతృత్వంలో సిబ్బంది రంగంలోకి దిగారు. 95వ వార్డు పొర్లుపాలెంలో కుక్క దాడిలో గాయపడిన చీపురుపల్లి రుత్విక్ అనే బాలుడిని పరామర్శించారు. యాంటీ ర్యాబిస్ వ్యాక్సిన్ వేశారు. ఆ వార్డులో సుమారు 25 వీధి కుక్కలను పట్టుకొని ఆపరేషన్ కోసం పంపించినట్టు వెటర్నరీ డాక్టర్ కిషోర్ తెలిపారు. మేయర్ ఆదేశాల మేరకు ప్రతిరోజూ సుమారు 100 వీధి కుక్కలకు ఇసుకతోట, గోపాలపట్నం, గాంధీగ్రామం, నరవ, చినగదిలి, జడ్జికోర్టు సమీపాన గల వెటర్నరీ ఆస్పత్రిలో శస్త్ర చికిత్స చేయనున్నట్టు పేర్కొన్నారు.

డ్రగ్స్‌కు దూరంగా ఉండండి

అల్లిపురం: మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని టూ టౌన్ పోలీసులు సూచించారు. డాబాగార్డెన్స్ మహాత్మా గాంధీ మున్సిపల్ హైస్కూల్‌లో సోమవారం సచివాలయం మహిళా పోలీసు ఎండీ నూర్జహాన్ బేగం, జీవీవీ హారిక, రమాదేవి, శ్రావ్య, అమృతదీప్తి ఆధ్వర్యంలో టూటౌన్ ఎస్ఐ శ్రీనివాస్, మహిళా ఏఎస్ఐ కె.కాంతం విద్యార్థులకు డ్రగ్స్ వల్ల కలిగే దుష్పరిణామాలను వివరించారు. డ్రగ్స్ వినియోగించే వారి జీవితాన్ని మాత్రమే కాకుండా వారి కుటుంబంలో ప్రతి ఒక్కరిని ప్రభావితం చేస్తాయన్నారు. చిన్నారులు తమ కుటుంబంలో పెద్ద వారికి అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి బ్యానర్లు ప్రదర్శిస్తూ ర్యాలీ నిర్వహించారు. డ్రగ్స్‌ను నిర్మూలిద్దాం.. డ్రగ్స్‌కు దూరంగా ఉందాం అంటూ విద్యార్థులు నినదించారు. కార్యక్రమంలో టెలికాం అడ్వయిజరీ కమిటీ సభ్యుడు పాల శ్రీహరిరెడ్డి, ఎంజీఎం హైస్కూల్ హెచ్ఎం ఆర్‌వీవీఎస్ నాగభూషణం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాలుష్యం కట్టడికి జీవీఎంసీ కృషి


బస్సులో జీవీఎంసీ కార్యాలయానికి చేరుకున్న మేయర్ హరివెంకటకుమారి


సైకిల్‌పై కార్యాలయానికి వెళ్తున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

డాబాగార్డెన్స్: కాలుష్య నియంత్రణలో భాగంగా సోమవారం నగర మేయర్ గొలగాని హరివెంకటకుమారి తన క్యాంపు కార్యాలయం నుంచి ప్రజా రవాణా వ్యవస్థను ఉపయోగించి ఆర్టీసీ బస్సులో జీవీఎంసీ కార్యాలయానికి చేరుకున్నారు. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ తన బంగ్లా నుంచి సైకిల్‌పై చేరుకుని, జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్, కమిషనర్‌లు మాట్లాడుతూ కాలుష్య నియంత్రణలో భాగంగా సాధ్యమైనంత వరకు విద్యుత్ వాహనాలు ఉపయోగించాలని సూచించారు. కాలుష్యం కట్టడికి జీవీఎంసీ విశేషంగా కృషి చేస్తోందన్నారు.

పోలమాంబ ఆలయంలో శ్రావణ మాస పూజలు


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

ఏయూ క్యాంపస్: పెదవాల్తేరులోని శ్రీపోలమాంబ అమ్మవారి దేవస్థానంలో శ్రావణమాసాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం నుంచి సెప్టెంబర్ 15వ తేదీ వరకు ఆలయంలో ఈ పూజలు చేయనున్నారు. వచ్చేనెల 18, 25, సెప్టెంబర్ 1, 8, 15 తేదీలలో కుంకుమ పూజలు నిర్వహించనున్నారు. వచ్చేనెల 31న గురువారం శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని లక్ష కుంకుమార్చన చేయనున్నారు. అమ్మవారికి నెల పూజకు రూ.350 చెల్లించి భక్తులు తమ గోత్ర నామాలతో నెల రోజుల పాటు పూజలు జరిపించుకునే అవకాశం కల్పిస్తున్నారు. ఆఖరు రోజున అమ్మవారి ప్రసాదం అందిస్తారు. ఆలయంలో ప్రతి పౌర్ణమి, అమావాస్య రోజుల్లో నిర్వహించే చండీ హోమంలో భక్తులు రూ.1500 చెల్లించి స్వయంగా పాల్గొనవచ్చునని ఆలయ అధికారులు తెలిపారు.

గంగవరం పోర్టు కార్మికుల సమస్యలు పరిష్కరించండి


కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న అఖిలపక్ష నాయకులు

మహారాణిపేట: అదానీ గంగవరం పోర్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని అఖిలపక్ష నాయకులు కోరారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. అతి తక్కువ వేతనాలు ఇస్తున్న తమను ఆదుకోవాలని 14 రోజులుగా ఆందోళన చేస్తున్నామని సంఘాల నాయకులు పేర్కొన్నారు. గంగవరం పోర్టు నిర్మాణం కోసం గంగవరం, దిబ్బపాలెం మత్స్యకార గ్రామాల్లోని ఇళ్లు, భూములను ఇచ్చామని, ఏళ్లు గడుస్తున్న వేతనాలు పెంచలేదని నాయకులు వాపోయారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.కె.ఎస్.వి.కుమార్, హెచ్ఎంఎస్ జిల్లా అధ్యక్షుడు డి.అప్పారావు, టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నక్కా అప్పారావు, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మల్లన్న, గంగవరం పోర్టు ఎంప్లాయీస్ యూనియన్ వర్కింగ్ అధ్యక్షుడు బి.జగన్ తదితరులు పాల్గొన్నారు.

యువతి ఆత్మహత్య


స్వప్న(ఫైల్)

ఆరిలోవ: ఓ యువతి ఆత్మహత్య చేసుకున్న ఘటనపై ఆరిలోవ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. సీఐ సోమశేఖర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా డుంబ్రిగుడ మండలానికి చెందిన శెట్టి స్వప్న(22) దీన్‌దయాల్‌పురం ప్రాంతం సిద్ధార్థ నగర్‌లో అద్దింట్లో ఉంటోంది. ఆమె నగరంలోని ఓ బ్యూటీపార్లర్‌లో పనిచేస్తుంది. సోమవారం ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకొంది. స్థానికులు ద్వారా సమాచారం తెలుసుకొన్న ఆరిలోవ ఎస్ఐ అప్పారావు సిబ్బందితో వెళ్లి ఆమె మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీకి తరలించారు. డుంబ్రిగుడలో ఉన్న ఆమె తల్లిదండ్రులు మంగళవారం రానున్నారు. వారు వచ్చిన తర్వాత ఆమె ఆత్మహత్యకు గల పూర్తి కారణాలు తెలుస్తాయని సీఐ తెలిపారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
వైజాగ్ నార్త్
9912440606

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వైజాగ్ నార్త్
9010810033
Office mail : sakshiadvtvsp@gmail.com